క్లుప్తంగా

నిధులు మంజూరు

అశ్వారావుపేటరూరల్: పక్కా భవనాలు లేని కొత్త గ్రామ పంచాయతీలకు శనివారం నిధులు మంజూరు అయినట్లు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 19 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలను నిర్మించేందుకు రూ.3 కోట్ల 80లక్షల నిధులు విడుదల అయినట్లు ఆయన తెలిపారు. మంజూరైన వాటిలో అశ్వారావుపేట మండలంలోని దిబ్బగూడెం, గాండ్లగూడెం, గుర్రాల చెరువు, కోయ రంగాపురం, మొద్దులమడ, పాత రెడ్డిగూడెం, దమ్మపేట మండలంలోని అల్లిపల్లి, పూసుకుంట, సీతారాంపురం, శ్రీరాంపురం, వడ్లగూడెం, ములకలపల్లి మండలంలో పాత గుండాలపాడు, గుట్టుగూడెం, పాతగంగారం, చౌటుగూడెం, రామచంద్రాపురం, పుసుగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలంలో తొట్టిపంపు, చండ్రుగొండ మండలంలో మంగయ్యబజార్ గ్రామ పంచాయతీలు ఉన్నట్లు వివరించారు. ఒకొక్క భవనానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించగా, వీటిని ఐటీడీఏ ద్వారా నిర్మించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

మోతే గడ్డకు ప్రత్యేక బస్సులు

భద్రాచలంఅర్బన్: ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా బూర్గంపహాడ్ మండలంలోని మోతెగడ్డకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి మోతెగడ్డ గోదావరి ఒడ్డుకు ప్రతి 15 నిమిషాలకు ఒకసారి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రామారావు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కూలీలకు వైద్య శిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని గుంపెనకే కాలనీ సమీపం వద్ద ఉన్న వలస కూలీలకు ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇటికల బట్టీల వద్ద పనిచేస్తున్న వలస కూలీల వివరాలను వైద్య సిబ్బంది నమోదు చేసుకున్నారు. కూలీలందరికీ మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు టీకాలు వేసి, గర్భిణులకు పలు ఆరోగ్య సలహాలను అందించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పీహెచ్ఎన్ పూలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విమర్శలు సరికాదు..

అశ్వాపురం: పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 70 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ చేయలేని అభివృద్ధి మేము ఏడు సంవత్సరాల్లో చేశామని చెప్తూ ఇందిరాగాంధీపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి అన్నారు. అశ్వాపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మించింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సర్పంచ్ బట్టా సత్యనారాయణ, నాయకులు వెంకటరమణ, తూము వీరరాఘవులు, మోసిన్, చెన్నయ్య, నరసింహారావు, వీరయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోడు పత్రాలు పారదర్శకంగా పంచాలి

ములకలపల్లి: పోడు భూముల హక్కు పత్రాల పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన పోడు సాగుదారులందరికీ పట్టాపాస్ పుస్తకాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 8,363 మంది దరఖాస్తుదారులను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితంగా న్యాయం చేయాలని అన్నారు. హక్కు పత్రాలిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, పొడియం వెంకటేశ్వర్లు, గోపగాని లక్ష్మీనర్సు, గౌరి నాగేశ్వరరావు, గొగ్గెల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూలో చేరిన కార్మికులు

చర్ల: మండలంలో సీఐటీయూలో ఉన్న పలువురు మిషన్ భగీరథ కార్మికులు శనివారం ఐఎఫ్‌టీయూలో చేరారు. స్థానిక సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులను సంఘం మండల కార్యదర్శి లంకా వెంకట్ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు కొండా చరన విద్యార్థి సంఘం నాయకులు మద్ది లక్ష్మీనర్సింహారెడ్డి, సిద్ది రాజేష్, సూదుల కిరణ్, చింతల కృష్ణకాంత్, లీలావాసు, రవివర్మ పాల్గొన్నారు.

హరహర.. మహాదేవ..

- తాబేలు ఆకారపు ప్రదేశంలో వైద్యనాథలింగేశ్వరస్వామి
- సతీసమేతంగా నవగ్రహాలు
- ఎల్లలు దాటిన శైవక్షేత్ర ప్రత్యేకత
- శివరాత్రికి సన్నద్ధమవుతున్న ఆలయం



ఆలయం పక్కనే ఉన్న గోదావరి నది



వైద్యనాథలింగేశ్వరస్వామి ఆలయం



ప్రాంగణంలో 35 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

సండే స్పెషల్

మణుగూరురూరల్: దేశంలో ఎన్నో సుప్రసిద్ధ శైవ క్షేత్ర దేవాలయాల్లో మణుగూరు మండలం రామానుజవరం గ్రామపంచాయతీ కొండాయిగూడెం గ్రామంలో ఉన్న భ్రమరాంబ సమేత వైద్యనాథలింగేశ్వరస్వామి మహాక్షేత్రం ఒకటి. గోదావరి నది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో నిర్మితమైన ఆలయం భక్తులు ఎంతో ఆహ్లాదభరితంగా కనువిందు చేస్తోంది. రామానుజవరం పంచాయతీలో 2009లో శ్రీ భ్రమరాంబ సమేత వైద్యనాథలింగేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్టాపన జరిగింది. తూర్పున అభిముఖం కలిగిన ఆలయంలో గర్భగుడికి ఎదురుగా నంది విగ్రహం ఉంది. ఆలయానికి ఉత్తరాన గోదావరి నది ప్రవహిస్తోంది. ఆలయానికి పక్కనే వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ఉంది. మరో ప్రక్క 35 అడుగుల భారీ ఆంజనేయ స్వామి విగ్రహం క్షేత్రపాలకుడిగా భక్తులకు కన్నువిందు చేస్తుంది. ఆలయానికి చుట్టూ 108 శివలింగాలు, 108 మారేడు మొక్కలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

అఘోరాల చేత ప్రతిష్ఠాపన

స్థల పురాణం ప్రకారం.. స్వామి వారిని ప్రతిష్ఠించిన ప్రదేశం తాబేలు ఆకారంలో ఉండడమే ప్రత్యేకత. శైవక్షేత్ర ప్రాంగణంలో దేశంలో ఎక్కడా లేని విధంగా నవగ్రహాలను సతీసమేతంగా ఏర్పాటు చేయడమే కాకుండా.. ఒక్కో గ్రహానికి ఒక్కో ఆలయం ఏర్పాటు చేయడం ఆలయానికి ఉన్న మరో ప్రత్యేకత. ఇంతటి అద్భుతమైన ప్రదేశంలో పార్వతీ పరమేశ్వరులను కాశీ వంటి పుణ్యక్షేత్రాల వద్ద నిత్యం పరమశివున్ని ఆరాధించే అఘోరాలతో ప్రతిష్ఠించారు. ఆలయ ప్రారంభమైన తొలి దశలో అఘోరాలు ఇక్కడ ఉండి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాముఖ్యత మణుగూరు పట్టణంతో పాటు మణుగూరు చుట్టూపక్కల మండలాల్లో, పలు జిల్లాల ప్రజలకు తెలిసింది.

వైభవంగా మహాశివరాత్రి..

ప్రతీ ఏటా మహా శివరాత్రి, పవిత్ర కార్తీక మాసంలో కొండాయిగూడెం వైద్యనాథలింగేశ్వరస్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. వైద్యనాథలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తే వారికి ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయనే ప్రతీతి ఉండటంతో ఉత్సవాలకు మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల ప్రజలే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది భక్తులు వస్తుంటారు. గోదావరి పక్కనే వైద్యనాథలింగేశ్వర స్వామి ఆలయం ఉండడంతో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పుష్కరఘాట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

భక్తుల కోర్కెలను తీర్చే శివయ్య



రామానుజవరం గ్రామపంచాయతీ రామానుజవరం, కొండాయిగూడెం గ్రామాల సరిహద్దున ఉన్న భ్రమరాంబ సమేత వైద్యనాథలింగేశ్వరస్వామి భక్తుల కోర్కెలను తీర్చే శివయ్యగా విరాజిల్లుతున్నాడు. భక్తులను ఎల్లవేళలా కాపాడుతున్నాడు. ఎన్నో ఏళ్లుగా ఈ మహా క్షేత్రంలో జరిగే ప్రతీ ఉత్సవానికి వేలాది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివస్తుంటారు.

– సర్పంచ్ సతీష్, రామానుజవరం, మణుగూరు మండలం

ఈ ఆలయం మా అదృష్టం



భ్రమరాంబ సమేత వైద్యనాథ లింగేశ్వరస్వామి ఆలయాన్ని తమ గ్రామంలో నిర్మించడం తమ అదృష్టం. స్థానికులతో పాటు దూర ప్రాంతాల నుంచి ఎంతోమంది భక్తులు ఈ ఆలయానికి తరలివస్తుంటారు. ఆలయ నిర్మాణమైన నాటి నుంచి తమ గ్రామ ప్రతిష్ఠత మరింతగా పెరిగింది. సెలవు దినాల్లో కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని కాలక్షేపం చేస్తుంటారు.

– పీఏసీఎస్ డైరెక్టర్ మామిడిపల్లి సీతారామమ్, కొండాయిగూడెం, మణుగూరు మండలం

యువతకు శిక్షణ, ఉపాధి కల్పిస్తాం



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు

దమ్మపేట: చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇప్పించి తద్వారా ఉపాధి కల్పిస్తానని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు అన్నారు. శనివారం జలగం ప్రసాదరావు మండల పరిధిలోని మల్కారం, లచ్చాపురం గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. లచ్చాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలగం ప్రసాదరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ట్రస్టు ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించి, ఉద్యోగాలు కల్పిస్తానని అన్నారు. నిరుపేద గిరిజనులకు అవసరమైన మోటర్లు, కరెంట్ లైన్లు ట్రస్టు ద్వారా ఏర్పాటు చేస్తానని తెలిపారు. అనంతరం భూమికి పట్టాలు కలిగి ఉండి కూడా ఫారెస్ట్ అధికారులతో వివాదంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. స్పందించిన జలగం వెంటనే ఫారెస్ట్ ఉన్నతాధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప్‌సింగ్, రాజు, జలగం అభిమానులు చెలికాని సూరిబాబు, తాండ్ర మహేశ్వరరావు, కక్కిరాల రత్నాకరరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, చిట్టిబాబు, శ్రీరాముల ప్రసాద్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు



గరిగెలతో ద్వితీయ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 22వ జాతర మహోత్సవం శనివారం ఆరో రోజుకు చేరుకుంది. ఆరోరోజు ఉదయం దాతలు అందజేసిన పట్టు చీరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో పూజలు చేశారు. మధ్యాహ్నం దాతల ఆర్థిక సాయంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు ఆలయానికి చేరుకున్న భారీ భక్తుల సందడితో అమ్మవారి ద్వితీయ ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో గ్రామంలోని యువకులు ఆడవేషధారణతో అమ్మవారి గరిగెలను తలపై పెట్టుకుని పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈ కార్యక్రమం సందడిగా సాగింది. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన సూపర్ డూపర్స్ ప్రేమ్‌కుమార్ ఆర్ట్స్ టీవీ, సినీ ఆర్టిస్ట్ కార్యక్రమం భక్తులను అలరించింది.

అమ్మవారిని దర్శించుకున్న తుమ్మల..

శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో భాగంగా అమ్మవారిని మాజీ రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శ్రీ సీత లత కల్యాణమండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, ఎంపీపీ రేసు లక్ష్మి, సర్పంచ్‌లు మట్టా శివాజీ, సోడి జ్యోతి, మడి రాజేష్, బీఆర్ఎస్ నాయకులు సాగి శ్రీనివాసరాజు, మానె రామకృష్ణ, ఎండి.అలీంఖాన్, తోటమల్ల సుధాకర్, కొత్తూరి సీతారామరావు, కెల్లా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ జాతర

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులోని కట్ట మైసమ్మ తల్లి ఆలయం వద్ద జాతర ఉత్సవాలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి వేద పండితుల సమక్షంలో నిత్య పూజలు చేసి సామూహిక లలిత సహస్రనామ స్తోత్ర పారాయణాన్ని పఠనం చేశారు.

భక్తులు అమ్మవారికి దర్శించుకొని పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తూరు గ్రామానికి చెందిన భక్తులు కొండెపాటి శ్రీరామచంద్రమూర్తి వెండి గిన్నెను బహూకరించారు. అలాగే రాత్రి సమయంలో జాతర ఉత్సవాల్లో నిర్వహించిన రేలారే రేలా జానపద నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రహదారుల దిగ్బంధం

దుమ్ముగూడెం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా కేంద్రప్రభుత్వం చేస్తున్న తీవ్రజాప్యానికి నిరసనగా ఈ నెల 13వ తేదీన జాతీయ రహదారుల దిగ్బంధం చేయనున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొప్పుల తిరుపతిమాదిగ పిలుపునిచ్చారు. శనివారం గంగోలు గ్రామంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల మల్లూరు, చెన్నాం కృష్ణ, గద్దల రమేష్, పాడుతూరి సారయ్య, కొత్తపల్లి సరిత, వెంకటమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో దుకాణాలు, ఇళ్ల ఎదుట సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దొంగతనాల నివారణకు గత 10 రోజుల క్రితం జరిగిన సమావేశంలో సీసీ కెమెరాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన దాతలు వెంటనే వాటిని ఏర్పాటు చేయాలన్నారు. బీజీ కొత్తూరు గ్రామంలో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

భద్రాచలం: యటపాకకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పాటి వెంకయ్య కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు పరామర్శించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు బోదబోయిన బుచ్చయ్య, తిరుపతిరావు, రాంబాబు, మోహన్‌రావు, పోటు రంగారావు తదితరులు ఉన్నారు.

ఆలయానికి ఏసీ వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సాయినగరలో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయానికి దాసి సరస్వతి వారి కుమారుడు దాసి యుగంధర్-చైతన్య దంపతుల సహకారంతో ఏసీని శనివారం వితరణగా అందజేశారు. సరస్వతీ కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి శ్రీ ద్వారాకామాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన సురేష్‌స్వామి రూ. 50 వేలు విరాళంగా అందించారు. శ్రీరామనవమి రోజున దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి గాను కూరగాయలను వితరణగా అందించనున్నట్లు ప్రకటించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మణుగూరు మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో భాగంగా తొలుత న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు స్త్రీలకు సంబంధిత హక్కులు, గృహహింస, వరకట్న దురాచారం, ప్రాంసరీనోట్లు, క్రిమినల్ కేసులకు సంబంధించిన విషయాలను గురించి ప్రజలకు వివరించారు.

253 కేసులు పరిష్కారం

మణుగూరు కోర్టు పరిధిలో శనివారం జరిగిన లోక్ ఆదాలత్‌లో 253 కేసులకు పరిష్కారం చూపినట్లు మేజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కేసుల్లో సీసీ అడ్మిషన్స్‌లో జరిమానా ద్వారా రూ 1,17,000, ఎస్‌టీసీల ద్వారా 1,95,200 కలిపి మొత్తం రూ 3లక్షల 12వేల 200లు రావడం జరిగిందన్నారు. అదాలత్‌కు వచ్చిన సుమారు 300ల మందికి ధాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యవస్థాపకురాలు గంటా రాధ సారథ్యంలో పులిహోర అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు, సీఐ ముత్యం రమేష్, ఏడూళ్ల బయ్యారం సీఐ రాజగోపాల్, అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు, సబ్‌డివిజన్ ఎస్సైలు, మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 13న అశ్వాపురం మండలం మొండికుంట నుంచి చేపట్టే హాత్‌సే హాత్ జోడో పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అశ్వాపురంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు స్ఫూర్తిగా రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా మేడారం నుంచి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 13న పినపాక నియోజకవర్గంలో అశ్వాపురం మండలం మొండికుంట నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాదయాత్రలో పినపాక నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు తాళ్లూరి చక్రవర్తి, అశ్వాపురం, బూర్గంపాడు మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, కృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, కణితి కృష్ణ, వెంకటరమణ, కాకా రాములు, తూము వీరరాఘవులు, నరసింహారావు, మోసిన్, ఎంపీటీసీ రామకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ప్రజా సమస్యలపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాత్ సే హాత్ పాదయాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఇల్లెందులో పాదయాత్ర నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డిని కలిసి పలు అంశాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న పినపాక నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఉంటుందని, మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బట్టా విజయ్‌గాంధీ, పోలెబోయిన శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఇస్మాయిల్‌కు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రామస్తులు

ములకలపల్లి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. మండల పరిధిలోని మూకమామిడి గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇళ్లస్థలాల మంజూరీ తదితర విషయాలపై యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విలేకరుల ఇళ్లస్థలాల ప్రక్రియలో నెలకొన్న సమస్యలను ఖచ్చితంగా పరిష్కరిస్తామని అన్నారు. కాగా ఇస్మాయిల్ ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట అనంతుల రవి, ఛాత్రబోయిన వెంకటేశ్వర్లు, గట్టిగొర్ల యాకన్న, ఎస్‌కె.అబ్దుల్లా, కొత్తగుండ్ల సాయిబాబా, మధు, సుభానీ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మొండికుంటలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

అశ్వాపురం: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని తెలంగాణలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు మద్దతు పలకాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐకార్ సభ్యుడు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట పోలింగ్ బూత్ కేంద్రం పరిధిలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమం పేరుతో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ నాయకులు కరపత్రాలు ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న నిధులతో రాష్ట్రంలో, గ్రామ పంచాయతీల్లో పనులు సాగుతున్నాయన్నారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాటిపాముల ఐలయ్య, ఉపాధ్యక్షుడు పాటి వెంకటరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గోసుల రాములు, మొండికుంట పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడు పసునూరి సురేష్, మండల కార్యదర్శి గంగారెడ్డి, నాయకులు రామకృష్ణ, వేల్పుల నాగేంద్రం, చల్లంగి రాము, సురకంటి జీవన్‌రెడ్డి, సాయిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇళ్ల మధ్యనే తీగలు



మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలోని అమెర్ద కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్ల మధ్య, ఇళ్లపైన, ఇళ్లను తాకుతూ చేతికి అందే ఎత్తులో ఉంటున్నాయి. గతంలో విద్యుత్ వైర్లు తెగి పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ
ఫోన్ నంబర్: 9440811556